సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 15 । జూలై । 2024



కొత్త కొత్తగా.. 8లో▸

వ్యక్తి జీవితంలో టీనేజ్ కీలకం. ఈ దశలోనే ఇంటర్ మొదలవుతోంది. 'పది' పూర్తి చేసిన విద్యార్థులు కాలేజ్ లైఫ్‌లోకి అడుగు పెడతారు. అంతా కొత్తకొత్తగా ఉంటుంది.



కాలినడకే శరణ్యం

ఏజెన్సీ పరిధిలోని పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు తిప్పలు తప్పడం లేదు. ఏటా వర్షాకాలంలో ఎడ్ల బండ్లే దిక్కవుతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం 31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'డీఈవోపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: స్పోర్ట్స్ స్కూల్‌లో ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలకు తెర లేపిన డీఈవోపై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వృకోదర్, శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ విలాస్, జిల్లా కార్యదర్శి నాగేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. స్పోర్ట్స్ స్కూల్‌లో డిప్యూటేషన్‌పై నియమించేందుకు ఈనెల 2న నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. అయితే నిబంధనలు పట్టించుకోకుండా ఈనెల 13న నియామకాలు చేపట్టారన్నారు. రాజకీయ నాయకులు, సంఘాల నేతలు, పైరవీకారుల ఒత్తిడితో అర్హతలేని వారిని అక్రమంగా నియమించారని ఆరోపించారు. ఒక సబ్జెక్టుకు ఒకరినే నియమించాల్సి ఉండగా.. ఆంగ్లం, భౌతిక శాస్త్రంలో డీఈవోకు అనుకూలంగా ఉన్న వారిని ఇద్దరు చొప్పున నియమించారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నియమించిన వారిని వెంటనేతొలగించి అర్హులకు డిప్యూటేషన్ ఇవ్వాలని కోరారు.

రిమ్స్‌లో పీపీ యూనిట్ తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గల పీపీ యూనిట్‌ను ఆర్‌ఎంవో తొడసం చందు ఆదివారం తనిఖీ చేశారు. శిశువులకు వేసిన టీకాల వివరాలను సూపర్‌వైజర్ సుగుణను అడిగి తెలుసుకున్నారు. ప్రతి బుధ, శనివారాల్లో ప్రత్యేక శిబిరాలతో పాటు ప్రసూతి వార్డులో జన్మించిన శిశువుల తల్లిదండ్రులకు టీకాలపై అవగాహన కల్పించాలన్నారు.

'నామినేటెడ్' అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీల్లోని అన్ని తెగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ అవకాశాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఆదివాసీలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆదివాసీల్లోని అన్ని తెగలు కృషి చేశాయన్నారు. ఈ మేరకు ఐటీడీఏ చైర్మన్ పదవిని మిగతా ఆదివాసీ తెగకు కేటాయించాలని కోరారు. ఇందులో తుడుందెబ్బ నాయకులు రమేశ్, భోజన్న, రాందాస్, గంగాధర్, ముకుంద్‌రావ్, దిగంబర్ తదితరులున్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు దినేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై నెల గడుస్తున్నా కనీస వసతులు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట అభినందన్, శుభం, పవన్ కళ్యాణ్ ఉన్నారు.



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

స్పౌజ్.. అవకతవకలు!

- ఉపాధ్యాయ బదిలీల్లో నిబంధనలకు తూట్లు
- స్పౌజ్ పనిచేసే చోట కాకుండా అనుకూలంగా ఉన్న బడి ఎంపిక
- వివరాల సేకరణలో విద్యాశాఖ
- చర్యలకు ఆదేశించిన డీఎస్‌ఈ
- గత బదిలీల్లో ముగ్గురికి ఇంక్రిమెంట్ల కోత

ఆదిలాబాద్‌టౌన్: అందరికి ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయుల్లో కొందరు తప్పటడుగులు వేస్తున్నారు. ఇటీవల ఎస్జీటీల బదిలీల్లో పలువురు స్పౌజ్ ఉపాధ్యాయులు నిబంధనలు బేఖాతరు చేశారు. భార్య భర్తలు ఒకచోట పనిచేసేందుకు ఉద్దేశించిన వెసులుబాటును దుర్వినియోగం చేస్తున్నారు. స్పౌజ్ కేటగిరిలో భాగంగా భార్య భర్త ఒకే మండలంలో పోస్టింగ్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, కొంతమంది టీచర్లు నిబంధనలు అతిక్రమించి వారికి నచ్చిన పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు (డీఎస్‌ఈ) స్పందించి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు ఆ శాఖ అధికారులు స్పౌజ్ కేటగిరి వినియోగించుకున్న ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని గుర్తిస్తున్నారు. కమిటీలు వేసి వారిపై చర్యలు తీసుకోనున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో స్పౌజ్ దుర్వినియోగం చేసుకున్న ముగ్గురిపై చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

దుర్వినియోగం చేసిన టీచర్ల జాబితా సిద్ధం..

ఇటీవల బదిలీల్లో భాగంగా జిల్లాలో దాదాపు 800 మంది ఎస్జీటీ క్యాడర్ ఉపాధ్యాయులకు స్థానచలనం జరిగింది. ఇందులో 115 మంది స్పౌజ్ కేటగిరి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఆప్షన్లు ఇచ్చారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా 29 మంది ఎస్జీటీ స్పౌజ్ ఉపాధ్యాయులు కేటగిరిని ఉపయోగించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొంత మంది స్పౌజ్ పనిచేసే పాఠశాలలో పోస్టు ఉన్నప్పటికీ ఎంచుకోకపోవడం, మరికొంత మంది అదే మండలంలో వారికి అనుకూలంగా ఉన్న పోస్టు ఎంచుకోవడం, ఇంకొంత మంది స్పౌజ్ పనిచేసే ప్రాంతానికి దూరంగా ఎంపిక చేసుకున్నారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకొని లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. ఇదివరకు 2018లో బదిలీలు జరిగాయి. కొంతమంది ఉపాధ్యాయులు 12 నుంచి 13 ఏళ్లుగా దూర ప్రాంతాల్లోనే పనిచేశారు. తమకు అనుకూలంగా ఉన్న పోస్టు కోసం ఎదురుచూసినప్పటికీ లభించలేదు. ఈ క్రమంలో పలువురు ఉపాధ్యాయులు స్పౌజ్ కేటగిరి తొలగించాలని కోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే.



స్పౌజ్ వినియోగించుకున్న వారి వివరాలు పరిశీలిస్తున్న డీఈవో, ఉద్యోగులు

నిబంధనలకు తూట్లు..

భార్య భర్తలిద్దరు పనిచేసే పాఠశాలకు దగ్గరగా ఉండాలనే నిబంధనలతో ఉపాధ్యాయ బదిలీల్లో ప్రత్యేక పాయింట్లను కేటాయించి ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. ప్రత్యేక పాయింట్లు పొందిన తర్వాత భార్య భర్తలు ఎనిమిదేళ్లకు ఒకసారి ఎవరో ఒకరు మాత్రమే ఈ పాయింట్లను వినియోగించుకోవాల్సి ఉంటుంది. స్పౌజ్ పాయింట్లు తీసుకునే టీచర్ తన స్పౌజ్ పనిచేసే సమీప పాఠశాలను ఆప్షన్‌గా ఎంచుకోవాలి. అక్కడ ఖాళీగా లేకపోయినట్లయితే అదే మండలంలో, ఆ మండలంలో లేకపోతే పక్క మండలంలో ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలి. కానీ అలా కాకుండా కొందరు ఉపాధ్యాయులు తమకు నచ్చిన మండలాలకు వెళ్లేలా ఆప్షన్లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే నిబంధనలు ఉల్లంఘించిన వారి ఒక ఇంక్రిమెంట్ కోత మాత్రమే విధించడంతో వారికి పెద్దగా నష్టం ఉండడం లేదు. దాదాపు రూ.15వేల వరకు వేతనంలో కోత పడే అవకాశం ఉంది. కానీ వారికి అనుకూలంగాఉన్నస్థానం లభిస్తోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆప్షన్లు ఎంచుకున్న తర్వాత మిగిలిన పోస్టులు నిబంధనలు ఉల్లంఘించిన వారికి కేటాయిస్తే వారిపై చర్యలు తీసుకున్నట్లవుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

కమిటీలు వేసి విచారణ..

స్పౌజ్ కేటగిరికి సంబంధించి జిల్లాలో 115 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. బదిలీల్లో ఆప్షన్ ఇచ్చుకున్న వారి వివరాలు సేకరిస్తున్నాం. వారి దరఖాస్తులను పరిశీలించి స్పౌజ్ పనిచేస్తున్న పాఠశాలకు సమీపంలో వినియోగించుకున్నారా.. నిబంధనలను అతిక్రమించారా అనే అంశాలపై ఆరా తీస్తాం. ఇందుకోసం కమిటీలు వేసి విచారణ చేపడతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. – ప్రణీత, డీఈవో

జిల్లాలో మచ్చుకు కొన్ని..

- తలమడుగు మండలంలో పనిచేసే ఓ టీచర్ అదే మండలంలో స్పౌజ్ ఉపయోగించుకున్నారు. అదే మండల కేంద్రంలో పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పాఠశాలను ఎంపిక చేసుకున్నారు.
- నార్నూర్ మండలంలో తన భర్త పనిచేస్తున్న చోటకు బదిలీ కావాల్సి ఉండగా.. ఆ టీచర్ ఉట్నూర్ మండలానికి బదిలీ అయ్యేలా వ్యవహరించారు.
- ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు పాఠశాలలో పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ ఆ టీచర్ ఆ పాఠశాలను ఎంపిక చేసుకోకుండా రోడ్డు సౌకర్యం బాగున్న అదే మండలంలోని మరో పాఠశాలను ఎంపిక చేసుకోవడం గమనార్హం.
- జిల్లా కేంద్రంలో పనిచేసే తన భర్త చోటికి బదిలీ దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉండగా ఓ టీచర్ గుడిహత్నూర్ మండలంలోని పాఠశాలకు బదిలీ చేసుకున్నారు.
- బేల మండలంలో ఓ ఉపాధ్యాయురాలి భర్త పనిచేస్తుండగా ఆమె జైనథ్ మండలంలోని ఓ పాఠశాలకు బదిలీ అయ్యారు.
- ఆదిలాబాద్ అర్బన్ మండలంలో తన భర్త ఓ కార్యాలయంలో పనిచేస్తుండగా తాంసి మండలంలో స్పౌజ్ కేటగిరిని వినియోగించుకున్నారు.
- ఓ ఎస్జీటీ ఉపాధ్యాయురాలు తన భర్త బోథ్‌లో పనిచేస్తుండగా మావల మండలంలోని ఓ పాఠశాలను బదిలీలో ఎంచుకున్నారు.
- ఆదిలాబాద్ అర్బన్‌లో తన భర్త ఓ శాఖలో పనిచేస్తుండగా ఆమె తలమడుగు మండలాన్ని ఎంపిక చేసుకున్నారు.
- ఓ ఉపాధ్యాయురాలి భర్త బజార్‌హత్నూర్ మండలంలో పనిచేస్తుండగా ఆమె తాంసి మండలాన్ని ఎంపిక చేసుకున్నారు.

చేప పిల్లల పంపిణీకి ఓకే

- ఎట్టకేలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఈ సారి కూడా వందశాతం రాయితీ
- నేటి నుంచి టెండర్ల స్వీకరణ
- జిల్లాలో 1.23 కోట్ల సీడ్ వేసేలా కార్యాచరణ

జిల్లా వివరాలు
మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు: 95
సహకార సంఘాల్లోని సభ్యులు :4,490
రిజర్వాయర్లు : 08
మొత్తం చెరువులు : 232



కైలాస్‌నగర్: మత్స్యకారుల జీవనోపాధికి అండగా నిలుస్తున్న రాయితీ చేపపిల్లల పంపిణీపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేదా అనే దానిపై మత్స్యకారులతో పాటు అధికారవర్గాల్లోనూ ఆందోళన వ్యక్తమైంది. వర్షాకాలం ప్రారంభమైనా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఈ పథకం అమలు అనుమానమే అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. వాటికి తెర దించుతూ వందశాతం రాయితీతో చేప పిల్లల సీడ్ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.

1.23 కోట్ల చేప పిల్లలు..

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని 240 చెరువుల్లో 1కోటి 23లక్షల 06వేల 348 చేపపిల్లల సీడ్ వదిలేలా మత్స్యశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో రిజర్వాయర్లు, మేజర్ చెరువుల్లో 80ఎంఎం నుంచి 100 ఎంఎం సైజు గల 87.60 లక్షల చేప పిల్లలను వదిలేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వీటికి రూ.1.63పైసల చొప్పున ధర నిర్ణయించారు. అలాగే జిల్లాలోని 232 చెరువుల్లో 35ఎంఎం నుంచి 40ఎంఎం సైజ్ గల 36.03 లక్షల చేప పిల్లలు వదలాలని నిర్ణయించారు. వీటికి 61 పైసల చొప్పున చెల్లించేలా ధర ఖరారు చేశారు. అయితే ఈ సారి టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడం, చేప పిల్లలు వేసే గడువు సమీపిస్తుండటంతో ఆగస్టు నెలాఖరులోపు సీడ్ పంపిణీ పూర్తి చేయాలని నిర్ణయించారు.

టెండర్ల ప్రక్రియ షురూ

ఉచిత చేప పిల్లల సీడ్ సరఫరా కోసం కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తూ ప్రభుత్వం ఈ నెల 10న నోటిఫికేషన్ జారీ చేసింది. నేటి నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు టెండర్లు స్వీకరించనున్నారు. 23వ తేదీ సాయంత్రం 4గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో వీటిని తెరుస్తారు. దాఖలు చేసిన గుత్తేదారులకు సంబంధించిన చేపపిల్లల పెంపకం కేంద్రాల పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో పెంపకం కేంద్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారిని ఎంపిక చేస్తారు. అందులో ఎవరైతే తక్కువ కోట్ చేస్తారో పరిశీలించి వారికి టెండర్ ఖరారు చేస్తారు. ఈ నెలాఖరులోపు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు అందాయి

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి అండగా నిలువాలనే ఉద్దేశంతో గతంలో మాదిరిగా వందశాతం రాయితీపై చేప పిల్లలను చెరువుల్లో వదలాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి సరఫరాకు సంబంధించి జిల్లా స్థాయిలో టెండర్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు అందాయి. ఆసక్తి, అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 23వరకు దాఖలు చేయవచ్చు. వాటిని పరిశీలించి నిబంధనల మేరకు ఖరారు చేస్తాం. – సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెఫ్ట్ ఓవర్ వెకెన్సీలలో ప్రమోషన్లు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే బదిలీ అయిన ఎస్జీటీలందరిని రిలీవ్ చేయాలన్నారు. మల్టీజోన్ 1,2 లలో ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. మోడల్ స్కూల్ బదిలీలకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులు సత్వరమే పరిష్కరించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లలో బదిలీలు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, సంఘ బాధ్యులు సూర్యకుమార్, కిష్టన్న, శ్రీనివాస్, గౌస్ మోయినొద్దీన్, విలాస్, శ్యాంసుందర్, స్వరూపరాణి, శివన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్

అ'పూర్వ'సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలం భీంసరి జెడ్పీఎస్ఎస్‌కు చెందిన 1993–94 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పదో తరగతి తర్వాత విడిపోయి దాదాపు మూడు దశాబ్దాలతర్వాత మళ్లీ కలుసుకున్నారు. పట్టణంలోని విద్యుత్ తరంగిణిలో అపూర్వ సమ్మేళనం పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఆత్మీయ ఆలింగనాల అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కిష్టారెడ్డి, శంకరయ్య, మూర్తి, రంగన్న, శ్రీధర్‌ను సత్కరించారు. ఇందులో పూర్వ విద్యార్థులు గంగమ్మ, త్రిశూల, సునీత, కల్పన, పద్మ, అశోక్, స్వామి, గంగాధర్ పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

జిల్లాకేంద్రంలో ఉద్రిక్తత

- తమ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ నాయకులు కిడ్నాప్ చేశారని బీజేపీ ఆందోళన
- ప్రజాభవన్ ఎదుట గందరగోళం
- పోలీసుల స్వల్ప లాఠీచార్జి
- హైడ్రామా నడుమ కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్.. రాత్రి మళ్లీ కాషాయ గూటికి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. తమ పార్టీ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ నాయకులు కిడ్నాప్ చేసి పార్టీలో చేర్చుకుంటున్నారని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రజాభవన్ ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించేందుకు నచ్చజెప్పినా వినలేదు. దీంతో వారిని బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని తోపులాట జరిగింది. డీఎస్పీకి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వారిని అక్కడినుంచి పంపించేందుకు యత్నించగా వినకపోవడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. దాదాపు రెండు గంటల పాటు గందరగోళ పరిస్థితి నెలకొంది. పట్టణంలోని కైలాసనగర్‌లో గల ప్రజాభవన్ వెళ్లే దారి నుంచి పోలీసులు వారిని బలవంతంగా నెట్టివేశారు. దీంతో రిమ్స్ ఎదుట గల రహదారిపై బైఠాయించారు. పోలీసులు రెండు వాహనాలను తీసుకొచ్చి ఆందోళనకారులను బలవంతంగా ఎక్కించారు. అయితే ఓ వ్యక్తి పోలీసు వాహన అద్దం ధ్వంసం చేశాడు. ఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్, ఆదిలాబాద్‌రూరల్ సీఐలు సత్యనారాయణ, కరుణాకర్ రావు, ఫణిందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్ తదితరులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాగా, ఈ తోపులాటలో పలువురు పోలీసులు, బీజేపీ నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఉదయం బీజేపీ.. సాయంత్రం కాంగ్రెస్.. రాత్రి మళ్లీ బీజేపీ గూటికి

- జిల్లా కేంద్రంలో ఓ కౌన్సిలర్ ఒకే రోజు పార్టీలు మారిన తీరిది

ఆందోళన జరుగుతున్న సమయంలో పట్టణంలోని 25వ వార్డుకు చెందిన బీజేపీ కౌన్సిలర్ రాజేశ్ దొడ్డన్న ప్రజాభవన్ నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చాడు. తనను ఎవరు కిడ్నాప్‌చేయలేదని, వ్యక్తిగత పనులపై ప్రజాభవన్‌కు వెళ్లాలని పేర్కొన్నాడు. కాగా హైడ్రామా మధ్య ఈయన సాయంత్రం కాంగ్రెస్‌లో చేరాడు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి హస్తం కండువా కప్పి ఆహ్వానించారు.

సాయంత్రం మళ్లీ బీజేపీలోకి..

సాయంత్రం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కౌన్సిలర్ రాజేశ్ రాత్రి మళ్లీ బీజేపీలో చేరాడు. ప్రజాభవన్ నుంచి బయటకు వచ్చిన కౌన్సిలర్ ను బీజేపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి తీసుకెళ్లి పార్టీ కండువా కప్పారు. తన నిర్ణయాన్ని మార్చుకుంటున్నట్లు కౌన్సిలర్ పేర్కొన్నాడు. కాగా, ఒకేరోజు కౌన్సిలర్ పార్టీ మార్పుపై పలువురు చర్చించుకున్నారు.



రాజేశ్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న 'కంది'



బీజేపీలో తిరిగి చేరుతున్న కౌన్సిలర్ రాజేశ్

అటవీ పోలీస్‌స్టేషన్లు..

- జిల్లాలో నాలుగు ఏర్పాటుకు ప్రతిపాదనలు
- అడవుల సంరక్షణ, అటవీచట్టాల అమలు కోసం..
- ఫారెస్ట్ అధికారులపై దాడులు, పోడు సాగు నేపథ్యంలో చర్యలు

ఇచ్చోడ: అటవీ సంరక్షణతో పాటు అటవీ చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు గాను ఆ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాలో నాలుగు అటవీ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. ఇటీవల జిల్లాలో కలప స్మగ్లింగ్ తగ్గినప్పటికీ పోడు సాగు వ్యవహారంలో అటవీ అధికారులు దాడులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న విషయాలకు సైతం పోలీసుల సాయంతో సిబ్బంది అడవుల్లో పర్యటించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రత్యేక స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించింది.



పోలీసుల సాయంతో అడవుల రక్షణ చేపడుతున్న అటవీశాఖ అధికారులు(ఫైల్)

జిల్లాలో ఇలా..

ఆదిలాబాద్ జిల్లాలో 1,83,210 హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉంది. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్‌లో మూడు డివిజన్ కార్యాలయాలు, అలాగే ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, ఆదిలాబాద్, బేల మండలాల్లో రెంజ్ కార్యాలయాలున్నాయి. ఉట్నూర్ డివిజన్‌లో బీర్సాయిపేట్, నేరడిగొండ మండలాల్లో కొంత భాగం, సిరిచెల్మ రెంజ్ పూర్తిగా టైగర్‌జోన్ పరిధిలోకి వస్తాయి. ఈ రెండు రేంజ్‌లు ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దులను కలుపుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం



జిల్లాలో అడవుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. అటవీ అధికారులపై దాడులు, పోడు సాగు నేపథ్యంలో అటవీ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అవసరమని గుర్తించాం. జిల్లాలో నాలుగు స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. – బర్నోబా, ఎఫ్‌డీవో, ఇచ్చోడ

జిల్లాలో నాలుగు ప్రతిపాదన..

ఇచ్చోడ మండలం టైగర్‌జోన్ పరిధిలో సిరిచెల్మ, బీర్సాయిపేట్, నార్నూర్, బజార్‌హత్నూర్ మండలాల పరిధి రేంజ్‌లలో అటవీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ స్టేషన్లు ఏర్పాటయితే కలప అక్రమ రవాణాను అరికట్టవచ్చు. అలాగే వన్యప్రాణుల సంరక్షణతోపాటు అటవీ చట్టాలను పకడ్బందీగా అమలు చేసే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా

జాతీయ సదస్సులకు జిల్లా వాసులు



ఢిల్లీకి వెళ్తున్న కార్మికసంఘం నాయకులు

నిర్మల్‌ఖిల్లా: దేశరాజధాని న్యూఢిల్లీలోని ద్వారక ఐటీసీలో ఈ నెల 15 నుంచి 17 వరకు మూడురోజులు నిర్వహించే సమావేశాలకు జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికసంఘం నాయకులు హాజరుకానున్నారు. ''ఆసియా పసిఫిక్ దేశాల నుంచి జరిగే చట్టబద్ధ, సురక్షిత వలసలు వాతావరణ మార్పులు'' అనే అంశంపై నిర్వహిస్తున్న ఇండియన్ కౌన్సిల్ మీటింగ్‌కు ప్రవాసిమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ పరికిపండ్ల హాజరు కానున్నారు. మరోవైపు ఇదే సంఘానికి చెందిన మహిళ నాయకురాలు కొమ్ము గీత జాతీయ మహిళా సదస్సులో ప్రవాసమిత్ర కార్మిక సంఘం తరపున పాల్గొననున్నారు. ఇందులో భవిష్యత్తులో కార్మికుల జీవనోపాధి – మహిళా కార్మికుల వృత్తిపరమైన సమస్యలు, మానసిక ఆరోగ్యం – భద్రత, లింగఆధారిత హింస, భద్రత కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

దాడి చేసిన నలుగురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారుగూడ కాలనీకి చెందిన మోరే సూర్యకాంత్, ఆయన కుటుంబ సభ్యులను కులం పేరుతో దూషించి కర్రలతో దాడి చేసిన నలుగురిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 10న సాయంత్రం సమయంలో సూర్యకాంత్ కాలకృత్యాల కోసం బయటకు వెళ్తున్నారు. అదేకాలనీకి చెందిన అమీర్ ఖాన్, మోసిన్ ఖాన్, సల్మాన్ ఖాన్, షేక్ ఫైజ్‌లు ఆయన్ను కులం పేరుతో దూషించారు. ఆయన కుటుంబ సభ్యులపై కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. నిందితులకు వైద్యపరీక్షల అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి 13 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. జిల్లా జైలుకు తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

దాబాల్లో మద్యం పట్టివేత

భైంసాటౌన్: దాబాల్లో మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ డి.రాజారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు దాబాల్లో పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుర్గా, శ్రీ ధాబా, భవానీ, శ్రీ హన్సిక దాబాల్లో 80 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని, ఈ మేరకు మద్యం స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. వ్యక్తి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని గుర్తించారు. లైట్ పింక్ కలర్‌షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంట్, అతని కుడిచేతి మణికట్టు వద్ద ఓమ్ అని పచ్చబొట్టు ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కొత్త కొత్తగా..

- జీవితం మలుపు తిరిగేది ఇంటర్‌తోనే..
- ఆకర్షణకు గురైతే భవిష్యత్తు ప్రశ్నార్థకమే
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ప్రణాళికతో ముందుకు సాగితే సక్సెస్
- ప్రారంభమైన ఇంటర్ తరగతులు

జిల్లా	పదో తరగతి ఉత్తీర్ణులు
ఆదిలాబాద్	11000
మంచిర్యాల	8552
నిర్మల్	8823
కుమురంభీం ఆసిఫాబాద్	5325
మొత్తం:	33700



ఆదిలాబాద్‌టౌన్: టీనేజ్ అత్యంత కీలక సమయం.. అంతేకాదు.. జీవితాన్ని మలుపులు తిరిగేవి ఇంటర్ దశనే. అన్ని తెలుసనే ఆలోచనతో విద్యార్థులు తప్పటడుగులు వేస్తారు. ఏమాత్రం తొందరపాటు నిర్ణయాన్ని తీసుకున్నా జీవితం మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్తవారు ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకు సాగితే భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఇప్పటికే కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది దాదాపు 33,700 మంది పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. వీరు ఇంటర్ ఫస్టియర్‌లో చేరగా తరగతులు ప్రారంభమయ్యాయి.

ఆకర్షణలకు లోనైతే..

ఇంటర్ విద్యార్థులు ఆకర్షణలకు లోనవుతుంటారు. ఈదశలో అందరికి చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమజీవితం అల్లరి పాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీకి డుమ్మా కొట్టడం, హీరోయిజం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లిన మాదిరిగానే కళాశాల తరగతులకు హాజరుకావాలి. పాఠ్యాంశాలపై దృష్టిపెట్టాలి. లెక్చరర్లు ఇచ్చే నోట్స్ ఎప్పటికప్పుడు రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

చదువుపై శ్రద్ధ పెట్టాలి



ఇంటర్‌లో చేరిన విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. తెలిసీ తెలియని వయస్సులో పెళ్లి చేసుకుంటే జీవితం నాశనం అవుతుంది. అనాలోచిత నిర్ణయాలతో భవిష్యత్తు అంధకారంలో వెళ్తోంది. ఈ దశనే విద్యార్థికి మలుపు.

– డాక్టర్ క్రాంతికుమార్

చెడు వ్యసనాలకు గురికావొద్దు

ఇంటర్‌లో చేరే విద్యార్థులకు చెడు వ్యసనాలకు గురి కావొద్దు. విద్యార్థులను ప్రభావితం చేసేది స్నేహం. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజంపై అవగాహన, లెక్చరర్లపై సదాభిప్రాయం ఉన్నవారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉంది. సిగరేట్లు, గుట్కాలు, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదు. పరిచయం ఉన్నవారు, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయొద్దు. అశ్లీలత వైపు మనస్సు మళ్లితే అంతే సంగతి. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. వీటితో జాగ్రత్తగా ఉండాలి.

లక్ష్యసాధన కోసం ముందుకు



విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. తల్లిదండ్రుల ఆశయసాధన కోసం ముందుకు సాగాలి. ప్రేమ, సినిమా, షికార్లకు ఆకర్షితులు కావొద్దు.

– భగవాండ్లు,
ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

అంతా తెలుసనే ధోరణితో..



ఇంటర్ విద్యార్థులు అంతా తెలుసనే ధోరణిలో వ్యవహరిస్తారు. ఒక్కసారి పంజరం నుంచి విడుదలైన పక్షుల్లా అనుభూతి పొందుతారు. అప్పుడే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. చెడు వ్యసనాలకు అలవాటుపడడం, కళాశాలకు డుమ్మా కొట్టడం చేస్తుంటారు. తల్లిదండ్రులు, పోషకులు పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్

తల్లిదండ్రులు గమనించాలి



ఇంటర్, డిగ్రీ దశల్లోనే విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలు అలవాటుపడతారు. సరదాగా మొదలై బానిసలుగా మారుతారు. వీటిని నియంత్రించేందుకు యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి. ఆడపిల్లల్ని ఇబ్బందులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. డ్రగ్స్‌కు ప్రోత్సహించినా, విక్రయించినా చర్యలు తీసుకుంటాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెలు మృతి

- మరో రెండింటికి గాయాలు



మృతిచెందిన గేదెలు

సారంగపూర్: ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ వైపు నుంచి నిర్మల్ వస్తోంది. మేతకు వెళ్లిన గేదెల మంద రోడ్డుకు పక్క నుంచే గ్రామంలోకి వెళ్తున్నాయి. మండలంలోని చించోలి(బి) సమీపంలోని మహబూభాఘాట్స్ వద్ద వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది. నిర్మల్ రూరల్ మండలం రాణాపూర్‌కు పశువైద్యుడు విజయ్, ఇదే గ్రామానికి చెందిన రైతు జాదవ్ ఇంధల్‌కు చెందిన రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో రెండింటికి తీవ్రగాయాలయ్యాయి. మరికొన్నింటికి స్వల్పగాయాలయ్యాయని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బస్సు డ్రైవర్ పరారీ ఉన్నారని పేర్కొన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



హన్మంతు

నెన్నెల: మండలంలోని నందులపల్లికి చెందిన సోమిశెట్టి హన్మంతు అదృశ్యమైనట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..హన్మంతు ఈనెల 13న మధ్యాహ్నం 12 గంటలకు మందు స్ప్రే చేసే డబ్బా కొనుగోలు చేసుకొని వస్తానని ఇంట్లో నుంచి రూ.30 వేలు తీసుకొని వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి రాలేదు. భార్య రజిత, కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టుపక్క ఇళ్లల్లో వెతికినా ఆ చూకీ దొరకలేదు. భార్య రజిత ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య



పెద్ద రాజన్న (ఫైల్)

తాంసి: కడుపునొప్పి భరించలేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తాంసి ఎస్సై శివరాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం బట్టిసావర్గాం గ్రామానికి చెందిన జక్కుల పెద్దరాజన్న (50) గత కొంత కాలంగా కడుపునొప్పి, షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూపిస్తే నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం తాంసి మండలం పొన్నారి గ్రామ శివారు పంట చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. భార్య రుక్మాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రేమ విఫలంతో యువకుడు..

దస్తురాబాద్: ప్రేమ విఫలం కావడంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. గోడిసీర్యాల గ్రామానికి చెందిన పానుగంటి పవన్(21) అదే గ్రామానికి చెందిన ఓ యువతి ప్రేమించుకున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరువురు పెద్దలకు తెలిసింది. యువతి తల్లిదండ్రులు ఆమెకు గత ఆరు నెలల క్రితం వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈనెల 11న గోడిసీర్యాల ఎక్స్‌రోడ్డు నుంచి మిత్రులకు వీడియో కాల్ చేసి పురుగుల మందు తాగాడు. వెంటనే మిత్రులు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పవన్‌ని నిర్మల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు పంపించారు. శనివారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని వలసకూలీ మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వలసకూలీ మృతి చెందిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం రుద్రపూర్‌కు చెందిన లెండుగురి హన్మంతు కుమారుడు చిన్న (19) గత కొంతకాలంగా కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలకు వలసవచ్చాడు. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఉదయం రాజీవ్‌నగర్ అండర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.



బ్రిడ్జిలా సాగునీటి కెనాల్

వంతెన కాదు..కెనాలే

ఈ చిత్రాన్ని చూస్తే ఇదేదో రైలు, బస్సులు వెళ్లేందుకు నిర్మించిన వంతెన అనుకుంటే పొరపాటే. ఇది జైనథ్, బేల మండలాల్లోని పంట చేలకు లోయర్ పెన్‌గంగా నది నుంచి సాగునీరదించేందుకు ప్రీకాస్ట్ పద్ధతిన వయాడక్ట్‌లతో నిర్మించిన కెనాల్ ఇది. ఆదిలాబాద్ రూరల్ మండలం చాందటి సమీపంలోని వాగుపై 68 పిల్లర్లపై 24.4 మీటర్ల పొడవు, 5.2 మీటర్ల వెడల్పుతో 67 షెల్ఫ్‌లతో ఆధునాతన సాంకేతికతతో నిర్మించిన వంతెన ఆకట్టుకుంటుండంతో ఔరా అనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



సాగునీటిని పంపించేలా షెల్ఫ్‌లతో నిర్మించిన కెనాల్



కెనాల్‌తో అనుసంధానించిన వయడాక్ట్ బ్రిడ్జి

నాగోబాకు పూజలు



అదనపు ఎస్పీ, ఎస్టీ డీఎస్పీకి నాగోబా చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో నాగోబా ఆలయంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, ఎస్టీ డీఎస్పీ పోచారం శ్రీనివాస్‌రావు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువా కప్పి సత్కరించారు. నాగోబా చిత్రపటాన్ని అందజేశారు. తర్వాత అదనపు ఎస్పీ, ఎస్టీ డీఎస్పీలు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఫలితాలు సాధించాలన్నారు. డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై సునీల్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకటరావు, మాజీ సర్పంచ్ రేణుక నాగనాథ్, పూజారి మెస్రం షేకు ఉన్నారు.

వేజ్ ప్రొటెక్షన్ కల్పించాలి

- సర్ఫేస్ జనరల్ మజ్దూర్ నిబంధనలపై సీనియర్ కార్మికుల పెదవి విరుపు
- ఈ నెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అన్ని కేటగిరీలకు వర్తించినా ప్రయోజనం శూన్యం



గనిలో పని చేస్తున్న సపోర్టుమెన్లు (ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణిలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీలో వేజ్ ప్రొటెక్షన్ కల్పించాలని సీనియర్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇన్నాళ్లు ఖాళీల కోసం వేచి అండర్‌గ్రౌండ్‌లోని అన్ని కేటగిరీ కార్మికులకు నేడు కంపెనీ ఇచ్చిన దీని నోటిఫికేషన్ ఏమాత్రం రుచించడం లేదు. ఆశపడి భంగపడ్డామని కార్మికులు వాపోతున్నారు. అన్ని ఏరియాల్లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీకి కంపెనీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో మొత్తం 108 ఖాళీలు సూచించింది. వీటికి ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అన్ని కేటగిరీలకు అవకాశం..

మొదటిసారిగా అండర్ గ్రౌండ్‌లో పనిచేసే అన్ని రకాల కేటగిరీల వారికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు అవకాశం కల్పించారు. ఇంతకు ముందు కేవలం అండర్ జనరల్ మజ్దూర్ వారికే అవకాశం ఉండేది. మిగతా కేటగిరీలకు వారికి లేదు. దీనిపై ఇటీవల గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంతో మాట్లాడి అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పించాలని కోరారు. కంపెనీ మైనింగ్‌స్టాఫ్, ట్రేడ్స్‌మెన్‌లను మినహాయించి మిగిలిన అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. చాలామంది యువ కార్మికులు ట్రామర్, ఎస్‌డీఎల్ ఆపరేటర్, కోల్‌కట్టర్, సపోర్టుమెన్ల యాక్టింగ్‌లు చేస్తున్నారు కాని ఆయా కేటగిరీల్లో చేరడానికి లెటర్లు తీసుకోవడానికి అయిష్టత చూపుతూ జనరల్ మజ్దూర్లుగా ఉంటున్నారు. దీంతో చాలా ఖాళీలు మిగులుతున్నాయి. కారణం సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్లు పడితే ఆయా కేటగిరీ వారికి అవకాశం లేకపోవడమే. ఈక్రమంలో కంపెనీ అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పిస్తే వారు చేరుతారని ఆశించి ఉత్తర్వులు ఇచ్చింది.

ఆర్థికంగా నష్టమే..

అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు వస్తే సీనియర్ కార్మికులకు, ఇతర కేటగిరీల వారికి ఆర్థికంగా నష్టం వస్తుంది. నెల వేతనంతోపాటు భవిష్యత్తులో పెన్షన్, గ్రాట్యూటీలో భారీ నష్టం వస్తుందని కార్మికులు పేర్కొంటున్నారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు కంపెనీ అందరికి అవకాశం కల్పించిన దాన్ని సద్వినియోగం చేసుకోకుండా కంపెనీ నిబంధనలు ప్రతిబంధకంగా మారాయి. 1వ కేటగిరీ కావడం, అండర్‌గ్రౌండ్ నుంచి ఎవరు వచ్చి చేరిన వారి పాత వేతనం రాదు. బేసిక్ ప్రొటెక్షన్ కల్పించకపోవడంతో సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు వస్తే ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకు మాత్రమే ప్రయోజకారిగా ఉత్తర్వులు ఉన్నాయి. అండర్ గ్రౌండ్‌లో 5వ కేటగిరీలో పని చేస్తున్న కార్మికుడు మజ్దూర్‌గా చేరితే అతనికి మొదటి కేటగిరీ వేతనమే ఇస్తారు. అప్పటి వరకు ఇంక్రిమెంట్లు ఉంటే వాటిని మొదటి కేటగిరీ వేతనంను కలిపి బేసిక్‌ఫిక్స్ చేస్తారు. రూ.వేలల్లో వేతనం తగ్గిపోతుంది. అతనికి ప్రమోషన్ వచ్చుడేమో కాని వేతనం ప్రకారం చూస్తే డీ ప్రమోట్ అయినట్లేనని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. కంపెనీ వేజ్‌ప్రొటెక్షన్ కల్పించి వీటిని భర్తీ చేయాలని సీనియర్ కార్మికులు పేర్కొంటున్నారు.

అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలి



పత్తి చేన్లను పరిశీలిస్తున్న ఎర్మ పున్నం

కోటపల్లి: పత్తి చేనులో గడ్డి మందు కొట్టి మొక్కలు చంపిన అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. మండలంలోని బొప్పారం గ్రామంలో పోడు సాగుదారులు రాజేశ్, ప్రశాంత్, సురేశ్, శంకర్‌కు చెందిన పత్తి చేన్లలో గడ్డిమందు కొట్టగా ఆదివారం ఆయన పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఇప్పటికే చాలాసార్లు సాగుదారుల జోలికి వెళ్లొద్దని చెప్పినా అటవీ అధికారులు దాడులు చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు చెందిన రాజేశ్‌కు హక్కుపత్రం ఉన్నా కంచెను తొలగించి పత్తి చేనుకు గడ్డిమందు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

అ'పూర్వ' కలయిక



కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ కలయికకు పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థి, ఉపాధ్యాయుడు బి.లక్ష్మణ్ రావు తనతండ్రి లింగారావు జ్ఞాపకార్థంగా పాఠశాల అభివృద్ధికి రూ.10 వేల నగదును ఎంఈవో ముత్యంకు అందజేశారు.



ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ 1994-95 బ్యాచ్ పదో తరగతి తొలిబ్యాచ్ ఆదివారం కలుసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత అందరూ హాజరైన అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కె.నారాయణరావు, కలిపె రాజ్ కుమార్, రజాక్‌బేగ్, క్రిష్ణమూర్తి, నర్సయ్య, పెద్దన్న, గంగన్న, వెంకటేశ్వర్లను సన్మానించారు.